# స్మృతి

రెస్టారెంటులో అడుగులు వేసామో లేదో అద్దాల తలుపు తీసి పట్టుకుని, "ఎంతమంది?" అడిగాడు స్టివార్డ్.

ప్రపంచీకరణ లాభాలు దాటినట్టుంది. రెస్టారెంట్ ఆధునికంగా ఉంది. సెంట్రల్లీ ఎయిర్ కండిషన్డ్ అవటానేమో చల్లదనం చుట్టేసింది.

"ఇద్దరమే. రెండు సీట్లు చాలు" అన్నాడు నా భర్త రవి.

"అదో.. ఆ మూల కూర్చుంటారా లేక వేరే చోటేదయినా చూపించమంటారా?"

రవి నా ముఖంలోకి చూశాడు. నా

అనుమతి కోసం చూసినట్టు ఉంటుంది కాని నిజానికి కాదు. చివరకు తనకి ఇష్టమయినదే చేస్తాడు. నాకు ఎక్కడయినా పర్వాలేదు. తలూపాను. అతను చూపించిన బల్ల గదిలో ఓ మూలగా కిటికీ పెద్ద అద్దానికి ఆనుకుని ఉంది.

వచ్చి ఎదురెదురుగా కూర్చున్నాం. అద్దపు కిటికీలోంచి సముద్రం కనిపిస్తోంది. సముద్రపు హోరు వినిపించడం లేదు. నిలబడిపోయినట్టు మేఘాలు కదలడం లేదు.

చేతి గడియారం వంక చూసుకున్నాను. ఒకటీ పదయింది. అదెప్పుడో కొన్నది. ఇంకా పనిచేస్తోంది. మా పెళ్ళి అయ్యాక రవి కొత్త గడియారం కొనిస్తానన్నాడు. కొనివ్వలేదు సరికదా ఒక కొత్త డ్రెస్ అయినా తీయలేదు. ఆకలిగా ఉంది. కొత్త స్థలం ఏదో చూసేందుకు కారులో వెళ్తూ ఆ రెస్టారెంటు చూసేసరికి ప్రాణం లేచివచ్చింది. బయటినుండి చూసినప్పుడు రెస్టారెంటు అంత పెద్దగా ఉన్నట్టు అనిపించలేదు. లోపల శుభ్రంగా ఉంది. సెంట్రల్ హాల్ మూడొంతులు నిండిపోయి ఉంది. భోజనం చేశాక చెప్పులు తీసి పట్టుకుని తీరం వెంబడి అరగంటపాటయినా నడవాలని ఉంది. అలల మీద అలలు కసిగా విరుచుకుపడడం వింతగా అనిపిస్తుంటుంది. అలలు విరిగిపోయాక అసలేం జరగనట్టు ఎంత మౌనంగా సముద్రంలోకి వెళ్ళిపోతుంటాయి?

"ఏమిటాలోచిస్తున్నావు?" అడిగాడు రవి.

నా జీతం అరాకొరా తప్ప మొత్తం అతనే తీసుకుంటూ ఉంటాడు. నా ఆలోచనల స్వాతంత్ర్యాన్నీ కోల్పోతానా? "ఏం లేదు" అన్నాను.

"ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటావు."

నవ్వి ఊరుకున్నాను. ఇంకో వ్యక్తి వచ్చి రెండు మెనూకార్డులు మా ముందు ఉంచి బల్ల పక్కనే నిలబడ్డాడు. ఆర్డరు తీసుకునేందుకు అతని చేతిలో పుస్తకం ఉంది. మెనూ తెరిచాను. సీఫుడ్ అయిటమ్స్ ఉన్నాయి. శాకాహారం కూడా ఉంది. మొత్తం చూశాను. రకరకాల డ్రింక్స్ పేర్లు రాసి ఉన్నాయి.

"ఏం తీసుకుంటావు?" అడిగాడు రవి.

"సీఫుడ్ తీసుకుందామని ఉంది"

"బటర్ నాన్‌తో రొయ్యల కూర చెప్పేదా?"

తలూపాను.

"చికెన్ ఫ్రయిడ్ రైస్‌తో మటన్ చాప్స్ తెప్పించుకుంటాను" అన్నాడు.

ధరల పట్టీ చూశాను. అయిదు నక్షత్రాల్లా ఉన్నాయి. కొన్ని రెస్టారెంట్లలో అయిదల్లా ఏడవుతున్నాయి. అప్పుడప్పుడు ఇంటి భోజనం కన్నా హొటల్స్‌లో భోజనం చేయడానికే ఇష్టపడుతుంటాను.

"ధరలు ఎక్కువగా ఉన్నాయి" అన్నాను.

అది ఎప్పుడూ రవి అనేమాట. ఈసారి నేనన్నాను.

"అతను మన ఆర్డర్ కోసం నిలబడి ఉన్నాడు" అంటూ చేతివేళ్ళు విరుచుకుంటూ అతనివంక చూసాను. ఇరువై అయిదేళ్ళు ఉండొచ్చు. అతనికన్నా అతను వేసుకున్న యూనిఫాం బావుంది. ఎవరివంకయినా తేరిపార చూడడం రవికి ఇష్టం ఉండదు. నా చూపులు అసూయ కలిగిస్తాయో ఏమో ఇంతవరకు బయటపడలేదు. విసుగు కనిపిస్తుంటుంది. మేం అనుకున్నదే చెప్పి "ముందు చికెన్ సూప్ తెచ్చి ఇవ్వు... రెండు..." అన్నాడు.

అతడు వెళ్ళిపోయాడు. గ్లాసు అందుకుని మంచినీళ్ళు కొద్దిగా తాగాను. చక్కటి సంగీతం తెరలు తెరలుగా వస్తోంది. కారులో చాలా దూరం ప్రయాణం చేయడం వలనేమో బడలికగా ఉంది. ఇంట్లోంచి ఎంత త్వరగా బయల్దేరదామనుకున్నామో అంత ఆలస్యం అయింది. ఆదివారం అవటాన ఆయనకు ఎన్నో ఫోన్‌కాల్స్. మాట్లాడుతూనే ఉంటాడు. రవి ఫోన్ కాల్స్ నేను అందుకోవడానికి ఇష్టపడను. నాకు అమ్మ, నాన్న, అన్నయ్య దగ్గర నుండే అరుదుగా కాల్స్ వస్తుంటాయి. అవీ ఆయనే తీసుకుంటూ ఉంటాడు. తను మాట్లాడి నాకు ఇస్తూ ఉంటాడు. అమ్మ నా ఆరోగ్యం గురించి అడుగుతుంటుంది. అన్నయ్య రవి ద్వారా ఏదయినా మంచి ఉద్యోగం ఇప్పించమని అడుగుతుంటాడు. అన్నయ్య విషయంలో నిస్సహాయురాలిని. రవి తప్పకుండా చేస్తానని మాట ఇస్తాడు. కానీ చేయడు. ప్రయత్నించడు. ఎందుచేతనో నా ప్రయత్నాలు సఫలం కాలేదు.

పెళ్ళి అయ్యాక ఒక ద్వీపంలా అయిపోయినట్టు అనిపిస్తుంటుంది.

ఆఫీసులోని ఉత్సాహం ఇంటికి చేరుకోగానే ఆవిరయిపోతుంది. రవి ఇంటికి చేరుకునేసరికి చాలాసార్లు పదకొండు దాటుతుంది. సంపాదనేనా జీవితం, ఇంకేం కాదా?

"ఈ స్థలం మారదామా?" అడిగాడు.

రవి మాటలకు ఆలోచనల్లోంచి తేరుకుని అతని ముఖంలోకి చూశాను.

"ఏమయింది, ఎందుకని?"

"వెనక్కి తిరిగి చూడకు. నీకు నాలుగు బల్లల అవతల ప్రగతి కూర్చుని ఉంది... మనం ఆమెకు కనిపించడం నాకు ఇష్టం లేదు" నా జవాబుకై ఎదురుచూడకుండా లేచి నుంచున్నాడు.

నేనూ లేచి నిలబడి పర్సు చేతిలోకి తీసుకున్నాను. నా చేయి అందుకుని నన్ను కవర్ చేస్తూ కాస్త దూరంగా ఉన్న మరో బల్ల దగ్గరకు తీసుకువెళ్ళాడు. ప్రగతి రవి మొదటి భార్య. ఆమెకు విడాకులు ఇచ్చాకే నన్ను చేసుకున్నాడు. విడాకులు ఎందుకు తీసుకున్నారో కారణం నాకు తెలియదు. నేను అడగలేదు. అతను చెప్పలేదు. ఒకటీ రెండుసార్లు తప్ప ఆమె ప్రస్తావన మా మధ్య ఎప్పుడూ రాలేదు.

రవి నా ఎదురుగా కూర్చుని ఉన్నాడు. ఆమె చివరి బల్లమీద కూర్చుని నాకు కనబడుతోంది. ఆమెకు ఎదురుగా నాలుగు సంవత్సరాల బాబు కూర్చుని ఆమెతో కబుర్లు చెపుతూ, నూడెల్స్ అనుకుంటాను, తింటున్నాడు. బాబు ముచ్చటగా ఉన్నాడు. ఆమెకు ముప్పయి అయిదేళ్ళు ఉండొచ్చు. ఎర్రగా చక్కగా ఉంది. తెల్ల అంచుగల బూడిద రంగు చీరలో మూడు నాలుగు సంవత్సరాలు చిన్న వయస్కురాలిగా కనిపిస్తోంది. లోగడ ఆమె నన్ను చూసి ఉంటుందని అనుకోను. ఆమెను చూడాలని ఎప్పటినుండో అనుకుంటుంటే ఈ రోజు చూడగలిగాను.

"ఆమె ఇప్పుడు ఎక్కడ ఉంటోంది?" అడిగాను.

"యూనివర్సిటీ పక్కనున్న రావు కాలనీలో నేనే ఫ్లాట్ కొనిచ్చాను. అందులో ఉంటోంది. పదహారు లక్షలయింది" రవి నిజం చెపుతున్నట్టు అనిపించడం లేదు.

"మళ్ళీ పెళ్ళి చేసుకుందా?"

తల అడ్డంగా ఆడించాడు.

"ఆ కుర్రాడు మీ అబ్బాయా?"

"ఊ"

"పేరేమిటి?"

చెప్పాడు కాని సూప్ మా బల్ల మీదకు రావడంతో సరిగా వినిపించలేదు. రవి ముఖంలో కదులుతున్న చిరాకు చూసి మరోసారి అడగాలనిపించలేదు.

"ఆమె మీతో పోట్లాడేదా?"ఆమె గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి కలుగుతోంది.

"లేదు. ప్రగతికి నేనెప్పుడూ తక్కువ చేయలేదు. నీలా ఉద్యోగం చేస్తుండేది. అవసరానికి మించి స్వేచ్ఛనిచ్చి పొరపాటు చేసానేమో. నేనంటే తనకు నచ్చలేదు. నాకూ తను నచ్చలేదు. కలిసి ఉండడం కష్టమనిపించింది. స్నేహితులుగానే విడిపోయాం"

భోజనం చేస్తూ మధ్యమధ్యలో ప్రగతి వైపు చూడకుండా ఉండాలేకపోతున్నాను. తన పిల్లాడిని చూడాలని, ఆడుకోవాలని, ప్రేమించాలని రవికి అనిపించదా?

తింటున్న వాడల్లా ఆగి, "నీతో ఎందుకు అబద్ధం చెప్పడం? ప్రగతితో అడ్జస్టు అవడం తేలికయిన విషయమేమీ కాదు... చాలా సార్లు నరకం అనుభవించాను" అన్నాడు.

మా ఇంట్లో ఆమె ఫోటో గాని, వాళ్ళ అబ్బాయి ఫోటో గాని లేవు. అంత చక్కటి మనిషి రవిని ఇబ్బంది పెట్టిందంటే నమ్మబుద్ధి కావడం లేదు. రవి పెట్టే కష్టాలు చెప్పుకోలేనివి. నా గొంతు నేను కోసుకుందామన్న సమయాలు లేకపోలేదు. భోజనం చేయడం ముగించేసరికి నలభై నిమిషాలు పైగానే అయింది. ఫింగర్ బౌల్‌లో చేతివేళ్ళు శుభ్రం చేసుకుని, "ఆమె ఇంకా అక్కడే ఉంది" అన్నాను. ఆమె ఆలోచనలు నన్ను వదలడం లేదు.

"ఉండనీ. అయిస్క్రీం చెప్పేదా, కాఫీ చెప్పేదా?"

నాకు ఏం కావాలో చెప్పి, "నువ్వేం అనుకోనంటే ఆమెతో మాట్లాడదామని ఉంది" భయపడుతూనే అన్నాను.

"ఏం మాట్లాడతావు?" స్వరం కఠినంగా ఉంది.

ఎందుకు అడిగానా అనుకున్నాను.

"నిజం చెప్పాలంటే ఆ మనిషి నాతో ఎప్పుడూ సంతోషంగా ఉండలేదు. గమ్మత్తేమిటో తెలుసా? మాది ప్రేమ వివాహం. నిన్ను ఆమెతో పోల్చను. మనది ప్రేమ వివాహం కాకపోయినా నువ్వు నన్ను ఎంతగా ప్రేమిస్తుంటావో ఊహించుకుంటేనే సంతోషంగా ఉంటుంది. నీలాటి భార్య నాకు దొరకడం అదృష్టంగా భావిస్తుంటాను... ఆమెను ఎలా సంతోషపెట్టాలో తెలియలేదు... అంతే... తెలుసుకోలేకపోయాను" ఆగాడు. నిజ జీవితం కన్నా నటన ఎంత గొప్పగా ఉంటుంది?

"అంత కష్టమైన వ్యక్తా?" ఆమె వయిపు చూశాను. ఆమె చూపులు సముద్రం మీద ఉన్నాయి. సముద్రం ఎండకు తడుస్తోంది.

రవి చెప్పే మాటలు వింటున్నాను, "కష్టమైన వ్యక్తే. జీవితంతో రాజీ పడని, దేనికీ సంతృప్తి పడని వాళ్ళను చూస్తే నీకు ఏమనిపిస్తుంది... నావంక చూసి ఒక మాట చెప్పు. మనం ఎంతో సంతృప్తిగా ఉన్నాం కాదా?"

అతని ముఖంలోకి చూసి చిన్నగా నవ్వాను. అవుననలేదు. కాదనలేదు. రవి ముఖం మన నీడ మనకు కనిపించే రాయిలా ఉంటుంది. అసలు ప్రగతి రవి నుండి ఏం కోరుకుని ఉంటుంది?

లేచి బయటకు వస్తున్నప్పుడు రవికి తెలిసిన వ్యక్తి ఎదురయ్యేసరికి అతనితో మాట్లాడుతున్న సమయంలో ప్రగతి కూర్చున్న బల్లకు దగ్గరగా వచ్చాను. ఆమె రవిని చూసినట్టు లేదు. కొన్ని క్షణాలపాటు ఆ సంతృప్తి చెందని, రాజీపడని కష్టతరమైన అందాలరాశి ముఖంలోకి చూశాను. గొప్ప వ్యక్తిలా అనిపించింది.

*(ఫ్రెంచి రచయిత్రి 'కొలెట్టి' (1873-1954) కథ 'ద అదర్ వైఫ్' చదివాక...)*

*చిత్ర మాసపత్రిక, ఆగస్టు, 2014*